క్లుప్తంగా

క్రైస్తవ సమాధుల తోటను సందర్శించిన కమిషనర్



సత్తెనపల్లి: పట్టణంలోని 6వ వార్డు వడ్డెర పాలెం సమీపంలోని క్రైస్తవ సమాధుల తోటను మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. క్రైస్తవ సమాధుల తోట పర్యవేక్షణ ఇన్‌చార్జిగా 5వ సచివాలయ శానిటరీ సెక్రటరీ షేక్ జుబేర్‌ను నియమించారు. క్రైస్తవ సమాధుల తోటకు సంబంధించి మరణ రిపోర్టు రసీదును జారీ చేయాలని జుబేర్‌కు సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి, మాజీ కౌన్సిలర్ బలిజేపల్లి సురేష్ కుమార్, సంఘ నాయకులు తదితరులు ఉన్నారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దు



సత్తెనపల్లి: జనావాసాల మధ్య మద్యం దుకాణంకు అనుమతులు ఇవ్వొద్దని పలువురు పట్టణ ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టణంలోని 14, 24 వార్డుల పరిధిలోని కట్టమూరి వారి వీధిలో గీతా మందిరం ఎదురుగా ఉన్న స్థలంలో మద్యం దుకాణం (వైన్ షాప్) ఏర్పాటు చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఆ ప్రాంత వాసులు శుక్రవారం తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.విజయ్‌కుమార్‌లకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీతా మందిరం ఎదురు, జనావాసాల నడుమ, నిత్యం ఇక్కడ నుంచే గార్లపాడు తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా ఉండే ప్రాంతంలో మద్యం దుకాణం పెట్టవద్దన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత వాసులందరూ సంతకాలు చేసి అధికారులకు వినతి పత్రాలు అందించారు.

చలివేంద్రం ప్రారంభం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా ఉన్నతాధికారులు ఆదేశం మేరకు వేసవి కాలంలో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా పాకాలపాడు బస్టాండ్‌లో పాకాలపాడు పీఏసీఎస్ ఆధ్వర్యంలో చలివేంద్రం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని పాకాలపాడు గ్రామ పెద్ద కొణికినేని సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో పాకాలపాడు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ఎంవీ నరసయ్య, సంఘ సీఈవో అన్నదాసు సాయి బాబు, సంఘ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో...



అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంచినీటి చలివేంద్రాన్ని ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మభాయ్ శుక్రవారం ప్రారంభించారు. కార్యాలయానికి వచ్చే వారు దాహార్తితో ఇబ్బంది పడకూడదని చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, భూక్యా రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గజ్జల నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో జీబీఆర్ హాస్పిటల్ నరసరావుపేట వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభిస్తారని అన్నారు. గుండ్లపల్లి గ్రామంలోని వాసవీ కల్యాణ మంపడంలో శనివారం నిర్వహించనున్న వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్లు, గుండె, థైరాయిడ్, బీపీ, షుగరు, ఆయాసం, కళ్లు తిరగడం తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రథమ చికిత్స కిట్లు పంపిణీ

నాదెండ్ల: జాతీయ ఉపాధి హామీ పథకం పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కిట్లను శుక్రవారం క్షేత్ర స్థాయి సహాయకులకు ఎంపీడీవో స్వరూపరాణి అందించారు. వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలకు అవసరమయ్యే ఔషధ కిట్లతో పాటూ మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు కల్పించి అవసరమైన వారికి జాబ్‌కార్డులు జారీ చేసి పనులు వేగవంతం చేయాలని సిబ్బందిని కోరారు. ఏపీవో రామారావు, జానెకెనడీ, సీవో నరేంద్ర, సహాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాలతో చెలగాటం



అచ్చంపేటలో ట్రాక్టరుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులు



చిన్నారులను ఎక్కించుకుని ఓవర్‌లోడ్‌తో వెళుతున్న ట్రాక్టరు

- ప్రమాదకరంగా తరలివెళ్తున్న కూలీలు, ప్రజలు
- ఆటోలు, ట్రాక్టర్లపై పరిమితిని మించి ఎక్కి ప్రయాణం
- బస్సు సౌకర్యం లేక ఆటోలు, ట్రాక్టర్లను ఆశ్రయిస్తున్న వైనం
- తూతూమంత్రంగా అవగాహన కార్యక్రమాలు

అచ్చంపేట: ట్రాక్టరు ట్రక్కులు, ఆటోలపై ఓవర్‌లోడ్‌తో వెళ్లేవారు ప్రమాదాలు కొనితెచ్చుకుని, కుటుంబాలకు దూరమవుతూ దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్న ఘటనలు మండలంలో కోకొల్లలు. కళ్ల ముందు ప్రమాదం జరిగినా అయ్యోపాపం అనే వాళ్లే కాని, ఎందుకు జరిగింది, అలాంటి ప్రమాదాలలో మనం చిక్కుకోకూడదన్న ఆలోచన చేయలేకపోతున్నారు. ఒక ట్రాక్టరు ట్రక్కుపై 50 మంది, ఒక ఆటోలో 30 మందికిపైగా ప్రయాణిస్తున్నారు. ట్రాక్టరు ట్రక్కులో వెనుక, రెండు పక్కల డోర్స్ ఓపెన్ చేసి డోర్స్‌పై కూడా కూర్చుని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. అభం శుభం ఎరుగని చిన్నారులతో వెళ్లే వారి భవిత గురించి పట్టించుకునేవారు లేకపోవడం దురదృష్టకరం. ఆచరణకు సాధ్యంకాని, అమలుకు నోచుకోని ప్రభుత్వ హామీలపై అర్థం పర్థం లేని గ్రామ సభలు నిర్వహించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే పాలకులు ఇలాంటి అవసరమైన వాటిపై ప్రజలకు అవగాహన కల్పించలేకపోతున్నారు. చిన్న పొరపాటుకు కుటుంబాలకు ఎలా దూరమవుతున్నారన్న విషయాన్ని వివరించలేకపోతున్నారు. తమ కళ్ల ముందు నుంచే ఓవర్ లోడ్‌తో ట్రాక్టర్లు, ఆటోలు వెళుతున్నా సంబంధిత అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తు న్నారు. పోలీసులు తూతూమంత్రంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

తరచూ ప్రమాదాలు జరుగుతున్నా...

ఆటోలు, ట్రాక్టర్లలో ఓవర్‌లోడ్‌తో వెళుతూ నిత్యం ఎంతో మంది గాయాలపాలై అంగ వైకల్యం పొందుతున్నా, తమపై ఆధారపడిన వారికి దూరమవుతున్నా ప్రజలకు మాత్రం కనువిప్పు కలగడం లేదు. గత ఆరు నెలల కాలంలో మండలంలో సంభవించిన ప్రమాదాలను పరిశీలిస్తే అచ్చంపేట సరిహద్దులో లోడ్ ట్రాక్టరు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టడంతో పెదపాలెం గ్రామానికి చెందిన కె.వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిబ్రవరి 16న ఆటో ప్రమాదంలో పుట్లగూడెం గ్రామానికి చెందిన పల్లలపాటి గురునాధం తీవ్ర గాయాలై కుడికాలు కోల్పోయాడు. ఇలా నిత్యం ఓవర్‌లోడ్‌తో వెళుతూ ప్రమాదాలు జరిగి గాయాలపాలైన ఘటనలు, మరణించిన ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు

పక్క గ్రామాలలో తిరునాళ్ల, జాతర వంటివి జరుగుతుంటే కుటుంబ సమేతంగా ట్రాక్టరు ట్రక్కుపై ప్రయాణించే వారు ఎక్కువయ్యారు. గ్రామాల్లో పెళ్లిళ్లు, ఫంక్షన్లకు వెళ్లేవారు కూడా పరిమితికి మించి ఆటోలలో ప్రయాణిస్తున్నారు. ఇలా వెళ్లడం మంచిది కాదు, ప్రమాదాలు జరుగుతాయని తెలిసినా నిర్లక్ష్యంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

ట్రాక్టర్లు, ఆటోలు నడుపుతున్న మైనర్లు

మైనార్టీ తీరనివారు, లైసెన్సులు లేని అనేక మంది పరిమితిని మించి ఆటోలు, ట్రాక్టర్లలో వెనుకనుంచి హారన్ కొడుతున్నా వినిపించనంత అధిక సౌండ్‌తో పాటలు వింటూ డ్రైవింగ్ చేస్తున్నా సంబంధిత అధికారులు ఎలాంటి హెచ్చరికలు చేయకపోవడం గమనార్హం. చిన్న నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు అనేకం జరుగుతున్నా అధికారులు మాత్రం ప్రజలకు తూతూమంత్రంగా అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ప్రయాణించే వారిపై చర్యలు తీసుకున్నట్లయితే ప్రమాదాలను కొంతవరకు నివారించవచ్చు.

బస్సు సౌకర్యం లేకే ఆటోలు

మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 28 గ్రామాలు, 6 గిరిజన తండాలు ఉన్నప్పటికీ కొన్ని గ్రామాలకు, గిరిజన తండాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. మండలంలో మిట్టపాలెం, సీతేశ్వరపాలెం, అంబడిపూడి, రోకటిగుంటవారిపాలెం గ్రామాలకు.. కంచుబోడు, జడపల్లి, సంద్ర, శ్రీనివాసతండాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో వారంతా ఎక్కువగా ఆటోలలో ప్రయాణిస్తున్నారు.

ఎక్కువగా వెళ్లేది మిర్చి కూలీలు

మిర్చి కూలీలను ఇంటి నుంచి తీసుకెళ్లటం, తిరిగి ఇంటికి చేర్చాల్సిన బాధ్యత రైతులదే. దీంతో రైతులు తమకు ఉండే ట్రాక్టర్లు, ఆటోలలో కూలీలను పొలాలకు తరలిస్తున్నారు. పొలాలకు వెళ్లే రోడ్లు ఎక్కువగా గుంత, మిట్టలతో ఉంటాయి. ఏమాత్రం బ్యాలెన్స్ తప్పినా ట్రాక్టర్ ట్రక్కు పల్టీ కొట్టే ప్రమాదం ఉంది. మిర్చి తీతలకు ట్రాక్టరు ట్రక్కులపై వెళుతూ ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి.

నోటి శుభ్రతతో రుగ్మతలు దరిచేరవ్

ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు



పరీక్షలు చేస్తున్న వైద్యధికారి డాక్టర్ జాఫ్రిన్ ఇమామ్ బి

సత్తెనపల్లి: నోటి శుభ్రతతో రుగ్మతలు దరిచేరవని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో వరల్డ్ ఓరల్ హెల్త్ డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ వరల్డ్ ఓరల్ హెల్త్ డేపై రూరల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్లు గ్రామాల్లో 40 సంవత్సరాలు పైబడిన మహిళలకు, పురుషులకు నోటి శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. దంత వైద్యాధికారి డాక్టర్ జాఫ్రిన్ ఇమామ్ బి మాట్లాడుతూ మార్చి 20 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు వరల్డ్ ఓరల్ హెల్త్ డే ప్రోగ్రామ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం పట్టణంలోని అర్బన్ షాదీఖానా స్కూల్, వడ్డవల్లిలోని ఉర్దూ స్కూల్, లక్ష్మీ థియేటర్ వద్ద గల ఉర్దూ స్కూల్లోని విద్యార్థులకు నోటి శుభ్రతపై అవగాహన కల్పించి బ్రష్‌లు, పేస్టులు అందించారు. అనంతరం విద్యార్థులు, ఆశ వర్కర్లు, ప్రజలతో ర్యాలీ నిర్వహించారు. ఏరియా వైద్యశాల ఆర్ఎంఓ శోభారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, స్టాఫ్ నర్స్ కమల పాల్గొన్నారు.

10న అరుణాచలంకు ప్రత్యేక బస్సు

డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలంకు ఈ నెల 10వ తేదీన రాత్రి 9.00 గంటలకు ప్రత్యేక సూపర్‌లగ్జరీ (2+2 పుష్‌బ్యాక్) బస్సు బయలు దేరుతుందని సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 11న శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని అదే రోజు రాత్రికి అరుణాచలం చేరి దర్శనం అనంతరం తిరిగి ఈ నెల 12న కంచికి వెళుతుందని, కంచిలో దర్శనం అనంతరం రాత్రికి బస్సు బయలు దేరి ఈ నెల 13న ఉదయం సత్తెనపల్లి చేరుతుందన్నారు. టికెట్ ధర రాను పోను ఒక్కొక్కరికి రూ.2,500 మాత్రమేనన్నారు. భక్తులు, యాత్రికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరని ఆయన కోరారు. వివరాలకు 9959225429, 7382897583, 7382896966, 73828 97116 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దాడిపై కేసు నమోదు

ముప్పాళ్ల: మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడిపై దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనే వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులైన మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి (పెదకాపు), అతని కుమారుడు బ్రహ్మారెడ్డి, కిష్టిపాటి లింగారెడ్డిలు దాడి చేసి గాయపరిచారు. బాధితుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని కోరిన ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంఈవో ఎం.గణేష్

క్రోసూరు: పాఠశాలలో గదుల కొరత ఉందని, మరొక పాఠశాలకు శ్లాబ్ వేయాలని, ఒక పాఠశాలలో డిజిటల్ తరగుతులు జరగటం లేదని, స్కూల్ ఆవరణ లెవలింగ్ చేయాల్సిన అవసరం ఉందని, అదే విధంగా వేసవి కాలంలో బోర్లు పనిచేయటం లేదని, జలజీవన్ మిషన్ ద్వారా నీళ్ల విడుదల చేయాలంటూ ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశంలో సంబంధిత అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించగా జెడ్పీటీసీ జమీలాగఫూర్ గౌరవ అధ్యక్షులుగా పాల్గొన్నారు. ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- ఈ సందర్భంగా గుడిపాడు ఎంపీటీసీ షేక్ సుల్తానా, నాగవరం సర్పంచ్ వారి పరిధిలోని విద్యా శాఖ సమస్యలపై ప్రశ్నించారు. గుడిపాడు జెడ్పీ పాఠశాలలో అదనపు తరగతి గదుల అవసరం ఉందని, అదేవిధంగా స్కూల్ ఆవరణలో లెవలింగ్ పనులు చేపట్టాలని, గాదెవారిపాలెం ఎంపీపీ పాఠశాలలో శ్లాబ్ పాడైందని, నాగవరం సర్పంచ్ చిరంజీవి మాట్లాడుతూ నాగవరం జెడ్పీ పాఠశాలలో డిజిటల్ తరగతులకు ఐఎఫ్‌టీలు పనిచేయటం లేదని అడిగారు. దీనిపై ఎంఈవో ఎం.గణేష్ మాట్లాడుతూ పాఠశాలల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. దీనికి అదనంగా ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రహరీ గోడలు లేని ప్రతి పాఠశాలకు ప్రహరీ నిర్మించుకునేందుకు మండల పరిషత్ గ్రాంటు నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయని, స్కూల్ కమిటీ తీర్మానం కాపీ అందజేస్తే పనులు చేపట్టవచ్చన్నారు.
- క్రోసూరు కొండ కింద బజారు ఎంపీటీసీ అడుగుడు చెరువులో నీళ్లు లేకపోవటంతో భూగర్భ జలాలు అడుగంటి కొండ కింద బాజరులోని బోర్లలో నీళ్లు రావటం లేదని, పెరికపాడు ప్రజాప్రతినిధి జల జీవన్ మిషన్ పథకం ద్వారా అన్ని గ్రామాలకు తాగు నీరు ఇవ్వాలని కోరారు. కొందరు ప్రజాప్రతినిధులు రీసర్వేపై అడిగిన ప్రశ్నలకు డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు వివరణ ఇచ్చారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి సమావేశంలో తెలియజేశారు.

దళిత బాంధవుడు బాబు జగ్జీవన్‌రామ్



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏపీ ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ మండలి సభ్యులు



విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న సీఐ విజయ్‌కుమార్, ఎస్సై నాగలక్ష్మి

క్రోసూరు: దేశ మాజీ ఉపప్రధాని, దళిత బాంధవుడు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి ఆధ్వర్యంలో క్రోసూరులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. క్రోసూరు పీహెచ్‌సీ వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ మండలి రాష్ట్ర హానరబుల్ చైర్మన్ గార్లపాటి దాసు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సాంఘిక, ఆర్థిక ఇక్కట్ల మధ్య చదువుకున్నారని, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారన్నారు. మొట్టమొదటిసారిగా బిహార్ శాసన సభకు ఎన్నికైన ప్రజానేత అని అన్నారు. అంతేకాకుండా పార్లమెంటు సభ్యునిగా కేంద్ర కేబినెట్‌లో పలు శాఖలకు మంత్రిగా పనిచేసారన్నారు. కార్యక్రమంలో మండలి జిల్లా అధ్యక్షులు చిలకా భాస్కరరావు, మేదర రోశయ్య, కిన్నెర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేజీబీవీలో జగ్జీవన్‌రామ్ జయంతి

గోళ్లపాడు(ముప్పాళ్ల): మండలంలోని గోళ్లపాడు కేజీబీవీ పాఠశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఎక్సైజ్ శాఖ సీఐ పి.విజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. చదువుకు ఆరంభం తప్ప అంతం లేదని, మహిళలు చదువుకుంటే సమాజం బావుంటుందని చెప్పారు. జగ్జీవన్‌రామ్ జీవిత విశేషాలను విద్యార్థినులకు వివరించారు. ఎక్సైజ్ శాఖ ఎస్సై నాగలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించవచ్చన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ అంటరానితనం వివక్షను రూపుమాపటానికి ఎంతో కృషి చేసిన మహనీయులు జగ్జీవన్‌రామ్ అని, ఆయన త్యాగం మరువలేనిదని చెప్పారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు జరిగిన పరీక్షలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థినులకు, తల్లిదండ్రులు లేని విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఝాన్సీస్వప్న హలత, ఫౌండేషన్ సభ్యులు అక్షయ్, ఆకాష్ శ్రీలత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం పిడుగురాళ్ల డివిజన్ ఇన్‌చార్జి అప్పలరాజు

నకరికల్లు: భావితరాల శ్రేయస్సు కోసం రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం పిడుగురాళ్ల డివిజన్ ఇన్‌చార్జి అప్పలరాజు అన్నారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతపై స్థానిక పాత పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాల ప్రభావం లేని అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలు, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా అభివృద్ధి చేయబడిన విత్తనాలు, తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయంలో అధిక లాభాలు సాధించడం, పీఎండీఎస్ విత్తనాల ప్రాధాన్యత, అధిక దిగుబడికి మార్గాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ అభివృద్ధికి గాను నాణ్యమైన విత్తనాల పంపిణీ, రైతులకు శిక్షణ, సాంకేతిక సహాయం, ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా అంజమ్మ, మాస్టర్ ట్రైనర్ బాజి, దేచవరం యూనిట్ ఇన్‌చార్జి రేణుక, గుండ్లపల్లి యూనిట్ ఇన్‌చార్జి రామ సుబ్బారెడ్డి, డీఎంఎంటీ రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహాల ప్రతిష్ట



హారతి అందుకుంటున్న డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి



అన్నసంతర్పణ ప్రారంభ పూజలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: సత్తెనపల్లి రూరల్ మండల పరిధిలోని ధూళిపాళ్ల గ్రామంలో సీతారాముల దేవస్థానం, విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. సీతారాముల నూతన శిలాబింబ, గణపతి, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ పూజలకు వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం హారతి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, ధూళిపాళ్ల ది ఆంధ్రబ్యాంక్ రైతు సేవా సహకార సంఘం మాజీ చైర్మన్ నల్లబోతు శివనారాయణ, పార్టీ ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే సీతారాముల నూతన శిలాబింబ, గణపతి, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ హాజరై పూజలు నిర్వహించారు. కొబ్బరికాయ కొట్టి అన్నసంతర్పణను ఎమ్మెల్యే కన్నా ప్రారంభించారు.

ప్రజారోగ్యానికి వైద్య పరీక్షలు ముఖ్యం

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: ప్రజల మెరుగైన ఆరోగ్యానికి వైద్య పరీక్షలు చాలా ముఖ్యమని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అపూర్వ హాస్పిటల్ శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఆరోగ్యం చాలా ముఖ్యమని, ఆరోగ్యంగా ఉండడానికి రక్త పరీక్షలు చాలా అవసరమన్నారు. పేద ప్రజలకు సరైన సదుపాయం లేక వైద్య పరీక్షలు చేయించుకోలేకపోతున్నారనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శివరంలో ఈసీజీ, గుండె, స్కానింగ్, కిడ్నీ పరీక్ష, ఎకో పరీక్షలు, షుగర్, బీపీ, జనరల్ వైద్య పరీక్షలు అన్నీ ఉచితంగా చేసి మందులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ల సాంబయ్య, మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ల అమరేశ్వరరావు, లగడపాటి గజానన, అపూర్వ వైద్యశాల వైద్యులు తదితరులు ఉన్నారు.

గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు అందించాలి

రాజుపాలెం: గర్భిణులు, బాలింతలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. మండలంలోని రెడ్డిగూడెంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బందికి ఆయన సూచనలు చేశారు. ల్యాబ్ పరీక్షలను త్వరగా అందించాలని తెలిపారు. ఆయన వెంట కమ్యూనిటీ హెల్త్ అధికారి జ్యోత్స్న, ఏఎన్ఎం ప్రమీల, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

న్యాయవాది అయ్యప్పపై దాడి హేయమైన చర్య



సత్తెనపల్లిలో న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయవాది కోటిపల్లి అయ్యప్పపై జరిగిన దాడి హేయమైన చర్య అని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్ కుమార్ అన్నారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి తాలూకా న్యాయస్థానంలో ఉన్న న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాది అయిన కోటిపల్లి అయ్యప్పపై జరిగిన దాడిని ఖండించారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులంతా న్యాయవాదుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినదించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మహంకాళి కోటేశ్వరమ్మ, అంకాళ్ల వెంకటేశ్వర్లు, కన్నెధార హనుమయ్య, కళ్లం వీరభాస్కర్ రెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, బుర్రి సైదయ్య, రాజశేఖర్‌ని గోపాలకృష్ణమూర్తి, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, తవ్వా హరనాథ్, బాదినేడి శ్రీనివాసరావు, గంప మదన గోపాల్, భాదరబోయిన వెంకటేశ్వరరావు, ఉల్లం మధు, రాజవరపు నరసింహారావు, తెనాలి నవజ్యోతి బాబు ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో రమణాకాంతరెడ్డి, పీడీ ఉమాదేవి

సత్తెనపల్లి: సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి శుక్రవారం సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణాకాంతరెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ ప్రతినిధి లక్ష్మీబాయ్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. సత్తెనపల్లి ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు ఇరువురు, 19 అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు 28 మంది దరఖాస్తు చేశారు. ఇంటర్వ్యూలకు కార్యకర్త పోస్టులకు ఇరువురు, సహాయకురాలు పోస్టులకు 25 మంది హాజరయ్యారు. అలాగే క్రోసూరు ప్రాజెక్టుకు సంబంధించి ఒక అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు ఒకరే దరఖాస్తు చేయగా ఒకరు హాజరయ్యారు. 12 అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు 14 మంది దరఖాస్తు చేయగా 12 మంది హాజరయ్యారు. వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి సరిఫికెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి, క్రోసూరు సీడీపీవోలు టి.శ్రీలత, బి.సరళ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీల, సిబ్బంది ఉన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్-కాలేజీలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందచేశారు. ప్రిన్సిపాల్ బి.రవినాయక్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.